క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ములుగు(గజ్వేల్)/సిద్దిపేటఅర్బన్/కొమురవెల్లి(సిద్దిపేట)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మండలంలోని కొక్కొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొన్ని పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

- సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెల్కటూరు, కోనాయపల్లిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సిద్దిపేట ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు.
- కొమురవెల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మధు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొమురవెల్లి, కిష్టంపేట, గౌరయపల్లి, రాంసాగర్, అయినాపూర్ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.
- జిల్లా కేంద్రంలోని 33/11కేవీ నర్సాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. హనుమాన్ నగర్, శంకర్‌నగర్, నర్సాపూర్, వాసవీనగర్, గుండ్ల చెరువు, కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

కిట్లను ధరించడం తప్పనిసరి



ఆపరేటర్లతో రజిత తదితరులు

హుస్నాబాద్: ఇంటి నుంచి స్లడ్జ్‌ను సేకరించే సమయంలో ఆపరేటర్లు తప్పకుండా కిట్లను ధరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత సూచించారు. పట్టణంలో నమస్తే స్కీంలో భాగంగా డి స్లడ్జింగ్ ఆపరేటర్లకు సోమవారం పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీపీఈ కిట్లను ధరించడం వల్ల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందన్నారు. ప్రజలు ప్రతి మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రయాణికుల పాట్లు



ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక బస్టాండ్‌కు ఆర్టీసీ ప్రయాణికుల కోసం రెండేళ్ల క్రితం రూ.10 లక్షల నిధులతో మరుగుదొడ్లు నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తిచేసి యేడాది కావస్తున్నా నేటికీ ప్రారంభించలేదు. దీంతో మరుగుదొడ్లు సౌకర్యంలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని ప్రారంభించాలని కోరుతున్నారు.

గంగాపూర్‌లో పశువైద్య శిబిరం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్‌లో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు టీకాలువేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ పాడిపశువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎదకు వచ్చిన పశువులను సకాలంలో గుర్తించి వైద్యం అందించాలని, పశువులకు సోకే వ్యాధులపై జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డా. చతుర్వేది, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ




ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రామచంద్రపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు వరంగల్ జిల్లాలోని పరకాల నేషన్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ చాటారు. గ్రామానికి చెందిన చిట్యాల నితిక సిల్వర్ మెడల్, బొలమెల్ల శ్రీనిధి బ్రాంజి మెడల్ సాధించారు. వారిని హెచ్ఎం శ్రీలత, గ్రామస్తులు సోమవారం అభినందించారు.

సమస్యల 'జాతర'

హడావుడి చేశారు.. అభివృద్ధిని మరిచారు



కొండపోచమ్మ ఆలయం, (ఇన్‌సెట్) అమ్మవారు

- సమీపిస్తున్న కొండపోచమ్మ ఉత్సవాలు
- అంతంత మాత్రంగానే ఏర్పాట్లు
- పార్కింగ్, పారిశుద్ధ్యంపై పట్టింపు లేదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలో గల కొండపోచమ్మ ఆలయం వద్ద ప్రతియేటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు మూడు నెలలపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 21 నుంచి ప్రారంభించి మార్చి 31 వరకు జాతర కొనసాగుతాయి. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అయినా ఇప్పటికీ ఏర్పాట్లు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో..

2019లో అప్పటి సీఎం కేసీఆర్ కొండపోచమ్మసాగర్‌ప్రాజెక్టు సందర్భంగా ఆలయం వద్ద నవ చండీ యాగం నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అదే సమయంలో ఆలయ అభివృద్ధికి రూ.40కోట్లు కేటాయించినట్లు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పలుసార్లు ఆలయాన్ని సందర్శించి ఆలయాభివృద్ధి కోసం స్థపతితో ఆలయ మ్యాప్ వేయించారు. అలాగే దేవాదాయశాఖ అధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులతో అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. అయినా నేటికీ ఆలయం వద్ద ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. గత ప్రభుత్వ హామీలన్నీ మాటలకే పరిమితం అయ్యాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోట్లు అన్నారు.. యాక్షన్ ప్లాన్ అన్నారు.. అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేశారు.. చివరకు అభివృద్ధిని మరిచారు.. ఇదీ గత ప్రభుత్వ హయాంలో కొండపోచమ్మ ఆలయంపై చూపిన తీరు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు అమ్మవారి ఆలయ అభివృద్ధికి పైసా కూడా కేటాయించలేదు. హుండీ, వేలం పాట ద్వారా యేడాదికి రూ.80లక్షల ఆదాయం వస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యమే. దీంతో మూడు నెలల జాతరకు వచ్చే భక్తులకు వసతులులేక ఇబ్బందులు తప్పేలా లేదు.

పార్కింగ్‌కు స్థల సమస్య

జాతర సమయంలో వేల సంఖ్యలో వాహనాలపై భక్తులు తరలివస్తారు. ఆ వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. ప్రభుత్వ భూమి లేదా గుడికి సంబంధించిన భూమి లేకపోవడం వల్ల పార్కింగ్ సమస్య జటిలమైంది. రోడ్డు వెడల్పు చేసినా పార్కింగ్ సమస్య మాత్రం అలాగే ఉంది. రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం వల్ల బోనాలతో వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలకు కూడా తీవ్రమైన అంతరాయం ఏర్పడుతుంది.

పారిశుద్ధ్యం అధ్వానం

ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య భక్తులను వెంటాడుతోంది. అక్కడి డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడిక్కడే మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కోళ్లు, మాంసం వ్యర్థాలు కాల్వల్లోనే పడేస్తున్నారు. యేటా ఇవే సమస్యలు ఎదురవుతున్నా ప్రభుత్వం, దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదు. అలాగే ఆలయం ఎదుట ఉన్న చెరువులో చెత్తాచెదారం వేయడం వల్ల నీరు కలుషితం అవుతోంది.



పరిసర ప్రాంతంలో కాల్వల దుస్థితి

ఏర్పాట్లు చేస్తున్నాం..

కొండపోచమ్మ జాతరకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. రెండు, మూడు చోట్ల తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆలయం వద్ద పార్కింగ్ సమస్య ఉంది. వాహనాలను రోడ్డుపై నిలిపివేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.

\- రవికుమార్, ఆలయ ఈఓ

రెగ్యులర్ చేయకుంటే ఉద్యమిస్తాం

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

సిద్దిపేటరూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయడం పోయి.. వారిని తొలగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరిస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సోమవారం ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యోగులు సమ్మె చేస్తున్నప్పటికీ సీఎం వారిని కనీసం పలకరించలేదన్నారు. గత సీఎం కేసీఆర్ చేసిన అప్పులకంటే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అధికంగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తిరిగి అధికారంలోకి రావాలంటే తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. పేదల కోసం 1200 ఎకరాల్లో చారిటీని ఏర్పాటు చేశానని, తాను ఎన్నో ఏళ్లనుంచి ప్రజలకు ధానాలు, సేవలు చేస్తుంటే అడ్డుకున్నారని వాపోయారు. గతంలో సిరిసిల్ల జిల్లాలో తనను కొట్టి పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలకిషన్, కార్యదర్శి నవీన్, కోశాధికారి కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ విద్యాసంవత్సరానికిగాను విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ హమీద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు మార్చి 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సంబంధిత ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుల నిరసన

సిద్దిపేటకమాన్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం నాయకులు బస్టాండ్ చౌరస్తా వద్ద సోమవారం నిరసన తెలిపారు. రూ.6వేల పెన్షన్ అమలుచేయాలని 000కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట రాబందు

- మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కుదించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రైతు భరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి, అధికారం చేపట్టాక మాట తప్పి రైతులను మోసం చేస్తున్నారని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా పరిధిలోని అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట రాబందుగా మారిందన్నారు.



హుస్నాబాద్: రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



గజ్వేల్‌లో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



నంగునూరు(సిద్దిపేట): ఏఈఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



సిద్దిపేటరూరల్: గుర్రాలగొంది వద్ద సిరిసిల్ల రోడ్డుపై బైటాయించిన నాయకులు



కోహెడ(హుస్నాబాద్): కోహెడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



చిన్నకోడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడి ఎంపిక

బెజ్జంకి(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి చింతకింది పరశురాములు ఆధ్వర్యంలో సోమవారం మండల నూతన కమిటీ ఎంపికైంది. అధ్యక్షుడిగా వడ్లూరి పరశురాములు, ప్రధాన కార్యదర్శిగా మోదంపెల్లి రాజు, ఉపాధ్యక్షులుగా ఎల్లయ్య, శంకర్, కార్యదర్శులుగా ఆనందం, తిరన్, లక్ష్మణ్, ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా సతీశ్, ప్రచార కార్యదర్శిగా ప్రసాద్, గౌరవ సలహాదారులుగా తాడిశెట్టి భూమయ్య తదితరులు ఎంపికయ్యారు.

◆ మహా ప్రదర్శనను విజయవంతం చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల మహాప్రదర్శనను విజయవంతం చేద్దామని కళామండలి అధ్యక్షుడు ముక్కపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరుతూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పరశురాములు, లక్ష్మణ్, శ్రీహరి, మల్లేశం, యాదగిరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ బొలెరో వాహనం టైర్ల అపహరణ

కొమురవెల్లి(సిద్దిపేట): గుర్తు తెలియని దొంగలు బొలెరో వాహనం టైర్లను అపహరించారు. ఈ ఘటన మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాలలో ఇటీవల చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు మంగళవారం వివరాలు తెలిపారు. ఆలయ అర్చకుడు రేవన సిద్దేశ్వరస్వామి తన బొలెరో వాహనాన్ని మూడో తేదీ రాత్రి వీఐపీ గేట్ సమీపంలో నిలిపారు. ఆ రాత్రి దొంగలు వాహనం టైర్లను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

◆ విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాలలో సోమవారం ఆయన వాటర్ ప్లాంట్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, గోపీకృష్ణ, కలీమొద్దీన్, రియజొద్దీన్, ఆనంద్, బుచ్చిరెడ్డి, గయజొద్దీన్, అజ్మత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో 33మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.83వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ రోడ్డు నిబంధనలు తప్పనిసరి

సిద్దిపేటకమాన్/గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు, సిబ్బంది పాల్గొన్నారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 25 మందికి న్యాయమూర్తి ప్రియాంక రూ.26.500 జరిమానాతో పాటు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

జర్నలిస్టులు వారధులుగా పనిచేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్: ప్రజలు, ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధిగా పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో 40మంది జర్నలిస్టులకు సోమవారం ఆయన ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చెప్పామన్నారు. హుస్నాబాద్‌లో ఇంకా ఇళ్ల స్థలాలు రాని వారి సమస్యను పరిష్కరిస్తామని, ఇతర మండలాల్లో ఉన్న వారికి స్థలాలు ఇవ్వడానికి ఆర్డీఓ, ఇతర అధికారులతో సమన్వ యం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న జర్నలిస్టులందరికీ స్థలాలు కేటాయించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో తనతో పాటు జర్నలిస్టులకు కూడా బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ చందు, కౌన్సిలర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

లవ్ ఎంఎండీ పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకట్టపై మంత్రి మార్నింగ్ వాక్ నిర్వహించారు. లవ్ ఎంఎండీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయం పూట నడక అలవాటు చేసుకోవాలని మంత్రి పొన్నం సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను

కనీసవేతనం కోసం కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సిద్దిపేటరూరల్: మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్‌చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌వద్ద సోమవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ గత ప్రభుత్వం జీఓ నంబరు 60 ప్రకటించినప్పటికీ అందులో పేర్కొన్న కేటగిరీల వారీగా వేతనాలను చెల్లించడం లేదన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో 8గంటల పనిదినాలను అమలు చేయకుండా కార్మికులతో 12 గంటలపాటు పనిచేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రూపులు ఏర్పాటుచేసి జీతాలు పెంచాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు నరసింహులు, రాజయ్య, వినోద, నరసింహులు, సిద్దులు, యాదయ్య, బాలయ్య, రాజు, రవి, విమల, విజయ, కవిత తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలతో పంటలకు తీవ్రనష్టం

తోర్నాల ఏరువాక శాస్త్రవేత్తలు



దౌల్తాబాద్(దుబ్బాక): పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తొగుట(దుబ్బాక)/దౌల్తాబాద్(దుబ్బాక): ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిరప, శనగ పంటలలో ఆకు మాడు తెగులు, కాండం కుళ్ళు తెగుళ్లను గమనించామని, వాటి వల్ల పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ తోర్నాల ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీదేవి, విజయ్, రమాదేవి, పల్లవి, ఉమా రాణి అన్నారు. సోమవారం వారు తొగుట మండలంలోని గోవర్ధనగిరి, కాన్గల్ అలాగే దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి, లింగరాజ్ పల్లి, తిర్మలాపూర్‌లో సాగైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకుమాడు తెగులు నివారణకు ప్రోపికోనాజోల్ ఒక ఎంఎల్ లీటరు నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు నాలుగు గ్రాముల బ్లీచింగ్ పౌడర్‌ను లీటరు నీటిలో కలిపి మొక్కల అడుగు భాగం తడిసేలా పోయాలని సూచించారు. వారి వెంట ఏఓ మోహన్, సాయి కిరణ్, ఏఈఓలు దేవేందర్, సంతోష్ కుమార్, సునంద పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దుబ్బాక అభివృద్ధిని విస్మరించారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని గుడికందుల గ్రామంలో రూ.25లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో దుబ్బాక నిధులు సిద్దిపేటకు తరలించుకుపోయారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో దుబ్బాకను తిరిగి అభివృద్ధి బాటపట్టిస్తామని చెప్పారు. రూ.2లక్షల రుణమాఫీ చేసి సీఎం రైతులను రుణ విముక్తులను చేశారని, త్వరలోనే రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రాంపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి పరిసరాలు, భోజన పదార్థాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి మోహన్, పంచాయతీ కార్యదర్శి రజని, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ విజయ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు స్వామి, మహిపాల్‌రెడ్డి, మల్లయ్య, కొండల్‌రెడ్డి, ఎల్లం, శ్రీనివాస్, నర్సింహులు, పోచయ్య పాల్గొన్నారు.

భూములిస్తేనే కాల్వల నిర్మాణం సాధ్యం

ఆర్డీఓ రామ్మూర్తి



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లిప్రాజెక్టు కింద పంట కాల్వల నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావాలని ఆర్డీఓ రామ్మూర్తి కోరారు. పొట్లపల్లిలో సోమవారం భూ సేకరణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్లపల్లిలో 1300 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు కాల్వల నిర్మాణం కోసం 32 ఎకరాల భూమిని సేకరిస్తున్నామని చెప్పారు. గ్రామ పరిధిలోని 185 మంది రైతులకు చెందిన భూముల నుంచి కాల్వలు పోతాయని వాటి కోసం భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందగా ముందుకు రావాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించడానికి కృషి చేస్తారన్నారు. అభ్యంతరాలున్న రైతులు వారి వివరాలను అధికారులకు అందిస్తే పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలతో ఆర్థిక అభివృద్ధి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకులో సోమవారం మహిళా సమాఖ్య సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకు నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధికి బ్యాంకు రుణాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, ఏపీఎం డాకయ్య, సీసీలు సిద్ది రాములు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.